ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
3 జిల్లా వార్తలు
గురువారం 18 జూలై 2024



మేడిపల్లిలో సీసీ రోడ్డు వేయించండి

యాచారం, జూలై 17 : మేడిపల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు సీసీ రోడ్డు వేయాలని బుధవారం గ్రామానికి చెందిన పలువురు యువకులు ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. సీసీ రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని యువకులు ఎమ్మెల్యేకు వివరించారు. యువకులు ఇచ్చిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి పంపించారు.

వైభవంగా తొలి ఏకాదశి



షాద్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

జిల్లాలోని అన్ని గ్రామాలలో బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో ప్రధాన ఆలయాలు సందడిగా మారాయి. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టారు.



అమనగల్లులో మొహర్రం పండుగలో భాగంగా పీర్ల ఊరేగింపు

త్యాగానికి ప్రతీక మొహర్రం

జిల్లాలో బుధవారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్ల చావిడిలలోని పీర్లను దర్శించుకొని బెల్లం, కొబ్బరితో పాటు దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పీర్లతో భారీ ఊరేగింపు నిర్వహించారు.



రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. పంటల సాగుకోసం తీసుకున్న రూ. రెండు లక్షలలోపు రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. దీనికనుగుణంగా నేడు లక్ష రూపాయల లోపు తీసుకున్న రుణాలను మాఫీ చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆ డబ్బులు రైతుల అకౌంట్లలో జమ కానున్నాయి. మొదటి విడతగా గురువారం రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేయడం వల్ల జిల్లాలో 49,741 మంది రైతులకు రుణ విముక్తి కలగనుంది. మొత్తంగా ఈ విడతలో జిల్లాలోని రైతులకు రూ.250 కోట్లకు పైగా రుణాలు మాఫీ కానున్నాయి.

రైతు మోములో ఆనందం!

నేడు మొదటి విడతగా రుణమాఫీ

- జిల్లాలో 49,741మందికి లబ్ధి
- రూ.లక్షలోపు మాఫీకి అంతా సిద్ధం
- సంబరాలకు కాంగ్రెస్ సన్నద్ధం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు దశలవారీగా రుణమాఫీ చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధమైంది. తొలి విడత నేడు రూ.లక్షలోపు రైతు రుణాలను మాఫీ చేయనుంది. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ, బ్యాంకర్లు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేరుగా ఈ రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేయనుంది. మిగతా మొత్తాన్ని కూడా దశలవారీగా అగస్టు 15లోగా రుణమాఫీ చేయనుంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే రైతులకు రూ. 2లక్షల లోపు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పార్లమెంట్ ఎన్నికల సమయంలో తాండూరుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోగా రైతులకు రుణ మాఫీ చేస్తామని ప్రకటించారు. అంతేకాదు... ఇచ్చిన హామీ తప్పక నెరవేరుస్తానంటూ అనంతపద్మనాభస్వామి ఆలయం మీద ప్రమాణం కూడా చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల రుణమాఫీపై ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించారు. రుణమాఫీకి అర్హత ఉన్న రైతుల వివరాలను సేకరించాలని అధికారులకు ఆదేశించారు. అర్హుల జాబితాను తయారు చేసే బాధ్యతను రాష్ట్ర సహకార బ్యాంకు అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ ఆదేశాలతో సహకార బ్యాంకు అధికారులు రైతుల వివరాలు సేకరించారు.. ఏఏ బ్యాంకుల్లో రైతులు రుణాలు ఎంతెంత తీసుకున్నారు? ఇందులో రూ. 2లక్షల లోపు రుణాలు తీసుకున్న వారి సంఖ్య ఎంత? వడ్డీ ఎంత అనే వివరాలను బ్యాంకర్ల నుంచి తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం రైతు రుణమాఫీకి మార్గదర్శకాలు కూడా విడుదల చేసింది. పాస్‌బుక్‌లు ఉన్న వారందరికీ రుణమాఫీ చేస్తామని వెల్లడించింది. కుటుంబం మొత్తానికి కలిపి రూ. 2లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇందుకోసం రేషన్ కార్డు డేటా కూడా పరిశీలిస్తామని తెలిపింది. అయితే దీనిపై విమర్శలు రావడంతో ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకమే ప్రామాణికమని తెలిపింది. అలాగే రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా పట్టాదారు పాస్ బుక్ ఉన్న వారందరికీ రుణమాఫీ చేస్తామని మంగళవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు.

ఈ తేదీల్లో రుణం తీసుకున్న వారికే..

ఇదిలా ఉంటే రుణమాఫీ అమలు కోసం ప్రభుత్వం కటాఫ్ డేట్ పెట్టింది. దీని ప్రకారం 2019 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2023 డిసెంబర్ 10 వరకు బ్యాంకుల నుంచి రూ.2 లక్షల వరకు రుణం తీసుకున్న వారంతా రుణమాఫీకి అర్హులే. వీరందరి వివరాలను బ్యాంకర్లు సేకరిస్తున్నారు. ఇదిలా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15 కంటే ముందుగానే రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది.

తొలివిడతలో 49,741మంది లబ్ధిదారులు

రుణమాఫీ పథకం ద్వారా జిల్లాలో 49,741 మంది రైతులకు నేడు రూ.లక్షలోపు రుణమాఫీ జరగనుంది. వీరందరికీ మొత్తం దాదాపు రూ.250 కోట్లకు పైగా రుణాలు మాఫీ చేయనున్నారు. అయితే, లబ్ధిదారుల పూర్తి వివరాల వెల్లడి విషయంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అర్థరాత్రి వరకు స్పష్టత రాలేదు. మిగతా అన్ని జిల్లాలకు ప్రభుత్వం నుంచి జిల్లా వ్యవసాయాధికారులకు సమాచారం బుధవారం సాయంత్రమే వివరాలు పంపారు. నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు, రుణ మాఫీ మొత్తం వివరాలు ప్రకటించారు. కానీ, ప్రభుత్వం నుంచి ఇంకా డేటా రాలేదని ఈ రెండు జిల్లాల వ్యవసాయాధికారులు చెప్పారు.

సంబరాలకు కాంగ్రెస్ శ్రేణులు సన్నద్ధం

రుణమాఫీపై గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని కాంగ్రెస్ నాయకత్వం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఓట్లు అడిగేందుకు గ్రామాలకు వెళ్లామని పంట రుణం మాఫీ చేశామని చెప్పడానికి కార్యకర్తలు, నాయకులు గ్రామాలకు వెళ్లాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గాంధీభవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీంతో నేడు జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహించుకునేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి.

నేడు చౌదర్‌పల్లి రైతులతో సీఎం ముఖాముఖి

యాచారం : రుణ మాఫీ అంశంపై యాచారం మండలం చౌదర్‌పల్లి రైతులతో గురువారం సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖీగా మాట్లాడనున్నారని మండల వ్యవసాయాధికారి జీఎస్ సందీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖాముఖి కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు.

సీఎంకు రైతులు రుణపడి ఉంటారు



రైతుల కష్టాన్ని గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డికి రైతులందరూ రుణపడి ఉంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొలివిడతలో లక్ష రూపాయల వరకు రైతు మాఫీ చేస్తామని ప్రకటించడం సంతోషంగా ఉంది. నేను తీసుకున్న రూ. 90 వేలు పూర్తిగా మాఫీ అవుతుండడం చాలా సంతోషంగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నాను.

కె. రాంరెడ్డి, రైతు, మల్కాపూర్, చేవెళ్ల మండలం

ఏకకాలంలో రుణమాఫీ సంతోషకరం



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఏక కాలంలో రూ. రెండు లక్షల రుణాలను మాఫీ చేయడం సంతోషకరం. మొదటి విడతలో నేడు లక్షలోపు రుణాలు మాఫీ అవుతున్నాయి. ఇది నాలాంటి ఎంతోమంది రైతులకు ఊరటనిచ్చింది.

- గంగాపురం లక్ష్మారెడ్డి, రైతు, లాలాపేట, కొందుర్గు మండలం

గతంలో సాగదీశారు

పంటరుణాల మాఫీ చేయడంపై సంతోషం కలుగుతుంది. గతంలో రుణమాఫీ ఐదేళ్లపాటు సాగదీశారు. దీంతో చాలా ఇబ్బంది పడ్డాం. వచ్చిన మాఫీ పైసలన్నీ మిత్తిలకే సరిపోయాయి. మాఫీ చేసిన పుణ్యమే లేకుండా పోయింది. ఇప్పుడు ప్రభుత్వం ఒకేసారి రుణ మాఫీ చేయడం మంచిగనే ఉంది.



- జెనిగె వెంకటేష్‌యాదవ్, రైతు, చెన్నారెడ్డిగూడ, మంచాల మండలం



రైతులకు బోరు మోటార్లు పంపిణీ చేస్తున్న మంత్రి జూపల్లి

పోడు భూముల సమస్య పరిష్కారానికి చర్యలు

- రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కడ్తాల్, జూలై 17: సాగు చేసుకుంటున్న పోడు భూములపై చెంచులు, గిరిజనులకు పట్టాలు అందజేసి హక్కులు కల్పిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పోడు భూముల విషయంలో ఇప్పటికే సాగులో ఉన్న గిరిజనులకు న్యాయం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంద న్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జమ్ములబావి తండాలో బుధవారం చెంచు రైతులకు బోరుమోటర్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్డీవో సూరజ్ కుమార్, డీటీడీవో రామేశ్వరిదేవి, ఏటీడీవో వెంకటయ్య, ఎంపీడీవో సుజాత, అధికారులతో కలిసి 26మంది చెంచు రైతులకు మంత్రి జూపల్లి బోరుమోటర్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జూపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో చెంచుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. దశాబ్దాల క్రితం చెంచు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను సాగుకు యోగ్యంగా మార్చేందుకు బోరు మోటర్లు, వ్యవసాయ పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. చెంచు, గిరిజనులు తమ భూముల్లో పండ్ల తోటలు, ఆదాయాన్నిచ్చే ఉద్యానవన పంటలను సాగు చేయాలని సూచించారు. అడవిని కాపాడుకునేలా పంటల సాగుతో పాటు చెంచుల జీవనోపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అటవీ సంపద, ఉత్పత్తులను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందని అన్నారు. అటవీ ఉత్పత్తుల ద్వారా చెంచుల ఆదాయ వనరులు పెంచి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చెంచు, గిరిజనులు తమ పిల్లలను చదివించి జీవితాల్లో వెలుగులు నింపుకోవాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా జమ్ములబావి తండా చెంచులు గవర్నర్ పేరిట ఉన్న తమ భూములకు తమ పేరిట పట్టాలు ఇచ్చి ధరణిలో నిషేధిత జాబితా నుంచి తొలగించాలని మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీ సింగ్, ఐటీడీఏ అధికారులు శ్రీనివాసులు, తహసీల్దార్ ముంతాజ్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మాజీ సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ గుంతలమయం

- స్థాయికి మించి లోడ్‌తో వెళ్తున్న వాహనాలు
- ధ్వంసమవుతున్న రోడ్లు.. పట్టని అధికారులు



కొత్తూర్, జూలై 17: స్థాయికి మించి లోడ్‌తో వెళ్తున్న భారీ వాహనాలతో గ్రామీణ ప్రాంత రోడ్లు ధ్వంసమవుతున్నాయి. కంకర లోడ్‌తో టిప్పర్లు తరచూ రోడ్లపై తిరుగుతుండటంతో రోడ్లన్నీ గోతులమయంగా మారుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న చిన్న రోడ్లపై భారీ వాహనాలు వచ్చి వెళ్తుండడంతో గోతులు ఏర్పడి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇటీవల కురిసన వర్షాలకు గోతుల్లో వర్షపు నీరు నిలవడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు వెళుతుండటంతో దుమ్ము, ధూళి ఇళ్లపై పడుతుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని క్రషర్ మిషన్లు ఉండడంతో నిత్యం టిప్పర్లు స్థాయికి మించి కంకర లోడ్లతో వెళ్తుంటాయి. గూడూర్, మల్లాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి స్థాయికి మించి లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గూడూర్‌నుంచి లోడ్‌తో వెళ్తున్న భారీ వాహనం

సర్వారెడ్డిపల్లిలో రూ.800 కోట్లతో
ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కడ్తాలలో కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రిశ్రీధర్‌బాబు, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు

ఆమనగల్లు/కడ్తాల్, జూలై 17(ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం సర్వారెడ్డి పల్లి గ్రామం వద్ద బహుళజాతి కంపెనీల సహకారంతో రూ.800 కోట్లతో వెయ్యి ఎకరాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అనంతరం యూనిట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రంలో రూ.3.35 కోట్లతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం భవనాన్ని బుధవారం రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఈవో సుశీందర్‌రావు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్‌లతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి స్కిల్ యూనివర్సిటీని 15 రోజుల్లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వెల్దండ మండలం చెర్కూర్ వద్ద 100 ఎకరాలలో త్వరలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. వనపర్తిలో ఐటీ టవర్స్ ఏర్పాటు, కంబాలపల్లి వద్ద మెగా ఇండస్ట్రియల్ పార్క్, హైదరాబాద్- బెంగుళూరు జాతీయ రహదారిపై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. త్వరలో అధికారుల బృందాన్ని ఆయా ప్రాంతాలకు పంపి అధ్యయనం చేసి నివేదికను సీఎంకు అందజేస్తామని చెప్పారు. కల్వకుర్తి ప్రాంతంలో ఓఎల్ఈడీ పరిశ్రమ ఏర్పాటుకు పరిశీలిస్తున్నట్లు శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రైతు రుణమాఫీ ఆగస్టు 15 వరకు అమలు చేస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు.. రాజీనామాకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సూరజ్‌కుమార్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, ఎంఈవో సర్దార్‌నాయక్, ఎస్‌వో అనిత, విద్యుత్ శాఖ ఎస్ఈ గోపయ్య, డీఎఫ్‌వో సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ గంపా వెంకటేశ్, మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, ఎఫ్ఆర్‌వో వెంకటయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి

వనమహోత్సవం కార్యక్రమంలో ప్రజలంతా ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలని మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులు పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించాలని కోరారు. కడ్తాల కేజీబీవీ పాఠశాల ఎదుట ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి మంత్రులు మొక్కలు నాటారు. కడ్తాల మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బస్టాండ్, 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ రాజేశ్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భానుకిరణ్‌లు వినతిపత్రాలు అందజేశారు.

ఘట్‌కేసర్ రూరల్, జూలై 17: మండలంలో బుధవారం మహిళా కానిస్టేబుళ్లు సైకిళ్లపై పెట్రోలింగ్ నిర్వహించారు. ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడ, దత్తాత్రేయకాలనీల్లో పెట్రోలింగ్ నిర్వహించి యువకులు, మహిళలతో మాట్లాడారు. అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, అనుమానంగా కలిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న లేడీ కానిస్టేబుళ్లు

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను

ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్

పరిగి, జూలై 17: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మారుతీకిరణ్ అన్నారు. బుధవారం పరిగిలోని గ్రీన్‌పార్కు హోటల్‌లో జరిగిన జిల్లా పార్టీ పదాధికారుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజా పోరాటాలతో పార్టీని బలోపితం చేద్దామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ పట్టును సాధించేలా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్రప్రధానకార్యదర్శి ఈశ్వరప్ప, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాంచందర్, ఆంజనేయులు, వెంకటయ్యగౌడ్, రాముయాదవ్, కేశవులు, హరికృష్ణ పాల్గొన్నారు.

బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి

కులకచర్ల, జూలై 17: బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు అన్నారు. బుధవారం కులకచర్లలో ఓ కార్యక్రమంలో పాల్గొని విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అండగా ఉంటుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్, బీసీ సంఘం నాయకులు కుమ్మరిస్వామి, చంద్రలింగం, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకల్లో గొడవ

» కత్తులు, కర్రలతో పరస్పర దాడి » నలుగురికి గాయాలు
» 11 మందిపై కేసు నమోదు » జలాల్‌పూర్‌లో ఘటన


దాడిలో తలకు గాయాలైన బాధితుడు

బషీరాబాద్, జూలై 17: పాత కక్షలతో రెండు కుటుంబాల మధ్య తలెత్తిన గొడవతో కత్తులు, కర్రలతో పరస్పరం దాడులకు దిగారు. దీంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బషీరాబాద్ మండలం జలాల్‌పూర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... కూర్వపద్మమ్మ, లోకుర్తి నగేష్ కుటుంబీల మధ్య పెళ్లికి సంబంధించి అమ్మాయి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం మొహర్రం వేడుకల్లో భాగంగా అసైదుల అడుతుండగా ఇరు కుటుంబాల్లోని ఇద్దరి మధ్య అర్ధరాత్రి గొడవ జరిగింది. రెండు కుటుంబాలకు చెందిన వారు అక్కడికి చేరుకున్నారు. దేవప్ప, సిద్ధప్ప, నర్సింహులు, నగేష్ ఒక వర్గంగా, దేవప్ప, వెంకటప్ప, నర్సింహులు, వెంకటప్ప, సిద్ధప్ప, రాజు, బుగ్గప్ప మరో వర్గంగా కత్తులు, కర్రలతో దాడులు చేసుకున్నారు. దీంతో గ్రామస్తులు భయం దోళనతో ఇళ్లలోకి పరుగు తీశారు. దాడుల్లో నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్, సిబ్బందితో గ్రామానికి చేరుకుని అందరినీ చెదరగొట్టారు. గాయాలైన నాలుగురిని తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ దాడికి సంబంధించి పద్మమ్మ, నగేష్ పరస్పరం ఫిర్యాదు చేయగా 11 మందిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'సీత్లా' విగ్రహాల పునఃప్రతిష్ఠ

» విగ్రహాలను తొలగించిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్


ఆందోళన చేస్తున్న బంజారాలు

ఘట్‌కేసర్, జూలై 17: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి ఎన్ఎఫ్‌సీనగర్ బ్యూటీ నెస్ట్ వెంచర్‌లో సీత్లా పండుగ సందర్భంగా ఏర్పాటు చేసుకున్న విగ్రహాలను తొలగించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని గోర్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజారాలు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. బంజారా సంఘం నాయకులు లింగయ్యనాయక్, రాములు మాట్లాడుతూ.. వర్షాలు కురవాలని, ప్రజలు, జీవులు సుభిక్షంగా ఉండాలని భక్తితో పూజలు చేస్తూ తాము సీత్లా పండుగ నిర్వహిస్తామన్నారు. కమిషనర్ సుచనల మేరకే పండుగ నిర్వహించుకున్నా కౌన్సిలర్ రమాదేవి కొందరితో కుమ్మక్కై తమ కుల దేవతల విగ్రహాలను తొలగించడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. అక్కసుతో విగ్రహాలను తొలగించిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లంబాడాలకు కౌన్సిలర్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కాగా సీత్లా విగ్రహాల తొలగింపులో తన సంబంధం లేదని కౌన్సిలర్ కె.రమాదేవి అన్నారు. ఆమె మాట్లాడుతూ బంజారా సోదరులు నాలుగేళ్లుగా తనతో స్నేహపూర్వకంగా ఉన్నారన్నారు. కొందరు గిట్టని వారు తనను రాజకీయంగా దెబ్బ కొట్టాలని బంజారాలను తనపైకి ఉసిగొల్పే చర్యలకు పాల్పడుతున్నారని, ఈ ఘటనపై పోలీసులే చూసుకుంటారన్నారు. ఓ మహిళా కౌన్సిలర్‌ను మానసిక క్షోభకు గురిచేయడం సరికాదన్నారు.

రైతులకిచ్చిన హామీ మేరకు
రుణాల మాఫీకి శ్రీకారం

» విలేకరులతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం, జూలై 17: రైతులకిచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ సర్కార్ పంట రుణాలు మాఫీ చేస్తుందని, ఇది చారిత్రాత్మకమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీల్లో ఇప్పటికే ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు లాంటివి అమలవుతున్నాయని, ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరి లక్ష్మీనృసింహస్వామి సాక్షిగా చేసిన ప్రకటనకు కట్టుబడి రుణాల మాఫీకి పూనుకుందంటూ గుర్తుచేశారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజా భవన్)లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలోకూడా లక్ష రూపాయల రుణమాఫీ పూర్తి చేయలేకపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.31వేల కోట్లు రుణమాఫీకి ముందుకు రావడంతో ప్రతిపక్షాల నోళ్లు మూతబడ్డాయన్నారు. ఇప్పటికే అన్ని బ్యాంకులు, పీఏసీఎస్‌లలో పేరుకుపోయిన రుణాల వివరాలను ప్రభుత్వం సేకరించిందని గుర్తుచేశారు. రెండోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం విడతల వారీగా రుణమాఫీకి పూనుకున్నా.. 12 లక్షల మంది రైతుల రుణాలను ఎగ్గొట్టడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ విషయం తెలిసిందేనన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఓ వైపు వడ్డీ చెల్లిస్తూనే.. సంక్షేమ పథకాలను ముందుకు తీసుకుపోతున్నామని అన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పనులు పూర్తి చేస్తాం

ఇబ్రహీంపట్నంలో అసంపూర్తిగా నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయం పనులు వెంటనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో చర్చించామని, అవసరమైన నిధులు విడుదల చేయించి పనులు చేపడతామన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని కూడా తొందర్లోనే అందుబాటులోకి తెస్తామన్నారు. ఏళ్ల తరబడిగా పేరుకుపోయిన దరణి సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించే పనిలో ఉందని ఆయన తెలిపారు.


అలిజా ఫాతిమా తల్లిదండ్రులకు రూ.50వేల చెక్కు అందిస్తున్న మాజీ ఎంపీపీ బాల్‌రాజ్

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

చేవెళ్ల, జూలై 17 : బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న బాలికకు వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు ముందుకొస్తున్నారు. చేవెళ్ల మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, గుడిమాల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎం.యాదగిరిలు బ్రెయిన్ ట్యూమర్‌తో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న రెండున్నరేళ్ల బాలిక తల్లిదండ్రులకు వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం రూ.50వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో బాలిక తండ్రి మహ్మద్ ఆరిఫ్, మైనార్టీ నాయకులు ఎండీ ఖలీల్, మహ్మద్ ఖదీర్, పలువురు నాయకులు ఉన్నారు.


దేవుని ఎర్రవల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఆట సామగ్రి

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

చేవెళ్ల, జూలై 17 : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు చాలా ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం చేవెళ్ల మండల పరిధి దేవుని ఎర్రవల్లి గ్రామంలోని అంగన్‌వాడీ పిల్లలతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఆడుకునేందుకుగాను క్రీడా సామగ్రిని సొంత నిధులు రూ.లక్షా 20 వేలతో ఏర్పాటు చేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని చెప్పారు. కాగా, క్రీడా సామగ్రి అందజేయడంతో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ అధికారులు, గ్రామస్తులు, పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ సామా మాణిక్యరెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, నాయకులు బక్కయ్య, మాణిక్యంగౌడ్, జంగయ్యగౌడ్, రవీందర్, వెంకటయ్య, శ్రీనివాస్, మల్లేష్, అరుణ్‌కుమార్, టీచర్లు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు బీఆర్ఎస్‌కు లేదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్, జూలై 17: అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు పనిగట్టుకుని కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేస్తున్నారని, వారికి విమర్శించే హక్కు లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి.రఘు, బాబర్‌ఖాన్, అగ్గనూరు విశ్వంలు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లను విస్మరించిందని, వారికి రూ.రెండు లక్షలకు, హెల్పర్లకు లక్ష రుపాయల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తామని మంత్రి సీతక్క ప్రకటించడం శుభపరిణామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా పాటిస్తుందన్నారు. రైతు రుణమాఫీకి ప్రభుత్వం శ్రీకారం చూడుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకులకు పనిలేక కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శలు, ఆరోపణలు చేయడం పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. విమర్శలు, ఆరోపణలు మానుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చెన్నయ్య, బాలరాజ్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహయాదవ్, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న చంద్రశేఖర్ ముదిరాజ్

బుర్ర జ్ఞానేశ్వర్‌కు నాయకుల శుభాకాంక్షలు

షాబాద్, జూలై 17 : రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను బుధవారం నగరంలోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ షాబాద్ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ ముదిరాజ్, పార్టీ నాయకులు సంజీవరెడ్డి, సుభాష్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, మహమ్మద్ జానీ, కిషోర్‌నాయక్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

లైట్లను ఆర్పేవారే లేరా?

» పగటి పూటా వెలుగుతున్న వీధిలైట్లు



పెద్దేముల్, జూలై 17 : గ్రామాల్లో వీధిలైట్లనే తెల్లవారి ఆర్పడం లేదు. వీధిలైట్లు పగలూ, రాత్రీ వెలుగుతూనే ఉన్నాయి. వాటికి గ్రామాల్లో ప్రత్యేక వైర్‌ను, స్విచ్‌లను ఏర్పాటు చేశారు. కానీ అవి పనిచేయడం లేదు. దీంతో లైట్లను ఆర్పడంపై ఎవరూ పట్టించుకోవడం లేదు. కరెంటు వృథా అవుతోంది. అధికారులు స్పందించి పగటిపూట లైట్లను ఆర్పేసేలా చర్యలు తీసుకోవాలి.

అభివృద్ధికి ఊతమివ్వండి

» సీఎంకు ఎమ్మెల్యే బుయ్యని విజ్ఞప్తి
» కొడంగల్ తరహాలోనే తాండూరుకూ నిధులిస్తామని సీఎం అభయం!


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి అభయమిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)

తాండూరు, జూలై 17: హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాల వలె తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్, తాండూరు పక్కపక్కనున్నాయి. ఈ ప్రాంత గ్రామాల ప్రజలు ఏ అవసరానికైనా తాండూరుకు వెళ్తుంటారు. విద్య, వైద్య, వ్యా పారం వంటి వాటికి తాండూరుపైనే ఎక్కువగా ఆధారపడుతారు. తాండూరు ప్రాంతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వెనుకబడినప్రాంతంగా గుర్తింపు పొందింది. కాలక్రమేనా అభివృద్ధి చెందుతున్నా ఇంకా చాలా అంశాల్లో వెనుకబడే ఉంది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రెండు నియోజకవర్గాలకు అనుసంధానమైన అంశాలపై నివేదికలివ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈ విషయంలో వివిధ శాఖల అధికారులు రిపోర్టుల తయారీలో నిమగ్నమయ్యారు. రెండు నియోజకవర్గాలకు తాగునీరు, విద్యుత్, వైద్యం, విద్య, పరిశ్రమలు, సాంకేతిక విద్య తదితర అంశాల్లో సారూప్యతను గుర్తించనున్నారు.

విద్యుత్ విషయంలో..

కొడంగల్ నుంచి ఎర్రన్‌పల్లి శివారు వరకు లైన్ పనులు చేపట్టారు. అక్కడ మెడికల్ కళాశాల, ఇతర పనులకు విద్యుత్ అవసరాన్ని గుర్తించి లైన్‌ను ఏర్పాటు చేశారు. తాగునీటి, పట్టణ అవసరాలకు కొడంగల్ నుంచి కరెంట్ లైన్‌ను తాండూరు వరకు పొడిగిస్తే విద్యుత్ సమస్య తీరుతుందనే ఎమ్మెల్యే సూచనతో పనుల కోసం సీఎం అధికారులకు ఆదేశించారు. వైరింగ్ ఎంత అవసరం, పోల్స్ అనుసంధానం వంటి అంశాలను లెక్కిస్తున్నారు. తాండూరులో కరెంటు సమస్య పరిష్కారానికి బషీరాబాద్ మండలం నవల్గా వద్ద 133కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు.

నీటి అవసరాల కోసం బృహత్తర ప్రణాళిక

తాండూరు కాగ్నా నది ఆధారంగా కొడంగల్ ప్రాంతానికి నీరు తీసుకెళ్లడంతో పాటు యాలాల మండల గ్రామాలకు నీరు అందించే అంశాన్నీ పరిశీలిస్తున్నారు. కొడంగల్ ప్రాంతంలోని మున్సిపాలిటీ, గ్రామాలతో పాటు యాలాల మండలం 8 గ్రామాలకు తాగునీరందించేలా ప్రణాళిక తయారు చేస్తున్నారు. అదనంగా మరిన్ని గ్రామాలకు ఉపయోగపడేలా చూస్తున్నారు. పైప్‌లైన్‌ను ఎంఎల్‌డీ నుంచి 20ఎంఎల్‌డీ సామర్థ్యానికి పెంచాలని నిర్ణయించారు.

వైద్యులను నియమించి ఉత్తమ సేవలు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ఖాళీలను భర్తీచేయడంతో పాటు నిధులివ్వాలని ఎమ్మెల్యే కోరారు. మైనింగ్‌లో కర్ణాటక తరహాలో రాయల్టీని తాండూరు ప్రాంతంలోనే వెచ్చించాలని విన్నవించారు. రెండు నియోజకవర్గాలను కలిపేలా లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేశారు. గోటుగకలాన్ వయా పటిమదిపల్లి-రుద్రారం, మర్పల్లి-రుద్రారం, దేవనూర్-కొత్తూర్, గోరెపల్లి వయా వడిచర్ల ఎన్కెపల్లి, బాగాయిపల్లి వయా మందాపురం-కొత్తూర్ తదితర లింక్ రోడ్లను గుర్తించారు. కడా ప్రాజెక్టు కింద ఈ రోడ్ల అభివృద్ధికి నిధులివ్వాలని సీఎం వద్ద ఎమ్మెల్యే ప్రతిపాదించారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు కాంగ్రెస్ నేతల సన్మానం



మేడ్చల్ టౌన్, జూలై 17: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నేరెళ్ల శారదను మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుధవారం సన్మానించారు. నగరంలో చైర్‌పర్సన్‌కు ఇంటికి వెళ్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాల్‌రెడ్డి అధ్వర్యంలో శాలువాకప్పి సన్మానించారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

» మంత్రుల పర్యటన నేపథ్యంలో అదుపులోకి..
» కడ్తాల నుంచి తలకొండపల్లి పోలీసుస్టేషన్‌కు తరలింపు
» తలకొండపల్లి ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో



తలకొండపల్లి : పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనలో దశరథ్‌నాయక్, శ్రీనివాస్ యాదవ్, సత్యం, నాయకులు

తలకొండపల్లి/కడ్తాల, జూలై 17: కడ్తాల మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి మంత్రులు దుదిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిల రాక నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మంత్రుల పర్యటనకు ఎలాంటి ఆటంకం కలుగకుండా బుధవారం ఉదయం మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జర్పుల దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు హరిచంద్‌నాయక్, పాండు నాయక్, హెచ్ఆర్ మహేశ్, అంజిలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తలకొండపల్లి మండల కేంద్రానికి చేరుకున్నారు. దశరథ్ నాయక్‌ను ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ నాయకులు పోలీసులచే అరెస్ట్ చేయించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తలకొండపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు శంకర్, పత్యనాయక్, పరమేశ్, నాయకులు జ్యోతయ్య, బోసు వెంకటయ్య, గోపాల్, శ్రీనివాస్ రెడ్డి, వీరయ్య, తదితరులున్నారు.

బీఆర్ఎస్‌ది కుట్ర రాజకీయాలు : ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్ : పంట రుణాల మాఫీ విషయంలో రైతులను, ఉద్యోగాల భర్తీలో నిరుద్యోగులను బీఆర్ఎస్ నాయకులు తప్పుదోవ పట్టిస్తూ కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతులు, నిరుద్యోగులు విపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కడ్తాల మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల ప్రారంభం అనంతరం జరిగిన సమావేశంలో నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజావిశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు ఉనికి కోసం కుట్రలు సాగిస్తున్నారని మండిపడ్డారు. రైతుల రూ.2లక్షల పంట రుణాలను ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మాఫీ చేస్తుండడంతో జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు వారిని తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా రుణాలు మాఫీ చేస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విద్య, వైద్య రంగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీరందించి రైతుల కలలు సాకారం చేస్తామని చెప్పారు. కేఎల్ఐ డీ-82 కాల్వ అసంపూర్తి పనులు సెప్టెంబర్‌లోగా పూర్తిచేసి 35వేల ఎకరాలకు సాగునీరందిస్తామని కసిరెడ్డి వివరించారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ ఎంపీపీ లు కమ్లీమోత్యనాయక్, అనితవిజయ్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు బీచ్యనాయక్, భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, చేగూరి వెంకటేశ్, గురిగళ్ల లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.


దాతలకు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

సేవా పౌరులుగా గుర్తింపు పొందాలి

» ఎస్ఎల్‌బీలో డార్మెటరీ హాల్ ప్రారంభం

వికారాబాద్, జూలై 17: విద్యార్థులు ఉన్నత చదువు చదివి గొప్పస్థాయికి ఎదిగి సమాజ సేవాపౌరులుగా మారాలని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బాలచంద్ర అన్నారు. ఫౌండేషన్, రాష్ట్ర గురుకుల సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించిన సంగం లక్ష్మీబాయి గురుకుల బాలికల కళాశాల డార్మెటరీ హాలు ప్రారంభోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. దాతలు రీగల్ రెక్స్‌నార్డ్ ప్రతినిధులు అనిర్ధపాటిల్, విజయ్‌కుమార్‌లకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో దాతలు విద్యార్థినులకు చదువు ప్రాధాన్యం, సామాజిక సేవలపై వివరించారు. విద్యార్థినుల కళారూపాలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. డార్మెటరీ హాలు తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ గోపిశెట్టి రమణమ్మ, విద్యార్థినులు, సిబ్బంది ఫౌండేషన్, రీగల్ రెక్స్‌నార్డ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ రమణమ్మను దాతలు అభినందించారు. కార్యక్రమంలో లింగంపల్లి కళాశాల ప్రిన్సిపాల్ సురభి చైతన్య, పాఠశాల, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కేదార్‌నాథ్ నమూనా ఆలయ నిర్మాణం అభినందనీయం


ఆలయ భూమి పూజలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ టౌన్, జూలై 17: ఉత్తర భారతదేశంలో ప్రసిద్ధ కేదార్‌నాథ్‌స్వామి ఆలయం వంటిదే ఎల్లంపేటలోనూ నిర్మించటం అభినందనీయమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం ఎల్లంపేటలో నిర్మిస్తున్న కేదార్‌నాథ్ ఆలయానికి భూమిపూజలో ఎంపీ పాల్గొన్నారు. ఉత్తర భారతానికి వెళ్లలేని వారు ఇక్కడే స్వామివారిని దర్శించేభాగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కాశీ పీఠాధిపతి నరేంద్రనాథ్ సరస్వతి, కమల్‌నయన్ దాస్, మణిరామ్‌దాస్ పూజలు నిర్వహించారు. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నాయకులు జగన్‌గౌడ్, దొడ్లమల్లి కార్జున్, ఆంజనేయులు ముదిరాజ్, జయ్‌పాల్‌సింగ్ పాల్గొన్నారు.


గోవా రాష్ట్ర సహకార బ్యాంక్ కార్యాలయాన్ని సందర్శించిన ఉమ్మడి జిల్లా ప్యాక్స్ చైర్మన్లు

గోవా డీసీసీబీని సందర్శించిన ప్యాక్స్ చైర్మన్లు

ధారూరు, జూలై 17 : స్టడీ టూర్‌లో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పీఏసీఎస్ చైర్మన్లు గోవా వెళ్లారు. డీసీసీబీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన 42మంది సొసైటీల చైర్మన్లు బుధవారం గోవాలోని కో-ఆపరేటివ్ బ్యాంకును సందర్శించారు. అక్కడి అధికారులతో సమావేశమైనట్లు హరిదాసుపల్లి సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి తెలిపారు. బ్యాంకు అధికారులే ఇక్కడి రైతులు పండించే జీడీపప్పును మార్కెటింగ్ చేస్తున్నారని ఆయన చెప్పారు. జీడిపప్పు వ్యాపారంతో బ్యాంక్ లాభాల బాటలో పయనిస్తోందని చెప్పారన్నారు. పంట రుణాలు, బంగారం తనఖా రుణాలను రైతులకు మంజూరు చేస్తుందని చైర్మన్ వివరించారు.

ట్రాఫిక్‌జామ్‌తో ఇబ్బందులు

» మేడ్చల్ వరకు జరుగుతున్న హైవే పనులు » ట్రాఫిక్ డైవర్షన్‌పై దృష్టి
» వాహనదారులు పట్టణం దాటేందుకు ప్రత్యామ్నాయ మార్గం


మేడ్చల్‌లో కొనసాగుతున్న రోడ్డు పనులు

మేడ్చల్ టౌన్, జూలై 17:హైదరాబాద్ శివారు నుంచి చేపట్టిన జాతీయ రహదారి పనులు మేడ్చల్ వరకు సాగుతున్నాయి. పారిశ్రామికవాడ నుంచి ఐటీఐ వరకు నిర్మిస్తున్న హైవే వంతెన పిల్లర్ల ఏర్పాటు పట్టణ శివార్లలో పూర్తయింది. ప్రస్తుతం ఆర్టీసీ కాలనీ నుంచి ఎన్జీవో కాలనీ వరకు రహదారి మధ్య పిల్లర్ల పనులు చేస్తున్నారు. దీంతో హైవేపై నిత్యం వాహనాలు కిక్కిరిసి కిలోమీటర్ల మేర జామ్ అవుతోంది. మేడ్చల్ శివారు వరకు ట్రాఫిక్ సాఫీగానే ఉన్నా పట్టణంలో అడుగు ముందుకు సాగని పరిస్థితి ఉంది. ముందు జాగ్రత్తగా అధికారులు మూడూ యూ టర్న్‌లను మూసేశారు. వివేకానంద చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న యూటర్నులను కూడా భవిష్యత్తులో క్లోజ్ చేసి మరో చోట ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. 25 పిల్లర్ల కోసం రోడ్డు మధ్యలో తవ్వుతారు. పట్టణం నడిబొడ్డున రహదారి ఉన్నందున రోడ్డుకు ఇరువైపులా నివాసం ఉంటున్న వారు రోడ్డుదాటే క్రమంలో ప్రమాదాలకు గురికాకుండా తాత్కాలిక యూటర్నుల ఏర్పాటుకు అధికారులు చర్చిస్తున్నారు.

చిన్న వాహనాల కోసం ప్రత్యామ్నాయ మార్గం

రహదారిపై వాహనాల జామ్‌ను అరికట్టేందుకు మొదట అధికారులు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. హెవీ వెహికిల్స్ మధ్య చిన్న వాహనదారులు ఇరుక్కోకుండా పెద్దచెరువు, తుమ్మ చెరువు కట్టల మీదుగా పట్టణం దాటేలా రోడ్డు సౌకర్యం కల్పిస్తారు. నగరం వైపు నుంచి మేడ్చల్ దాటి తూప్రాన్ వెళ్లే బైకులు, కార్లను చెక్‌పోస్టు నుంచి పెద్దచెరువు కట్ట మీదగా కిందిబస్తీ ఇందిరాగాంధీ చౌరస్తా, మహవీర్ చౌరస్తాల మీదుగా మళ్లిస్తారు. చెరువు కట్టపై నుంచి ముకుంద్‌థియేటర్ వద్దకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే తూప్రాన్ వైపు నుంచి వచ్చే చిన్న వాహనాలూ ఇదే దారి గుండా వెళ్లేలా చూస్తున్నారు. తుమ్మచెరువు కట్ట సామర్థ్యం అంతగా లేనందున బైక్‌లు, కార్లు మాత్రమే ఈ రోడ్డును వినియోగించుకునే వీలుంది.


యూ టర్న్ కోసం పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్

ప్రమాదాల నియంత్రణకు..

పట్టణంలో రోడ్డు పనులు పూర్తయ్యేంత వరకు ప్రమాదాల నియంత్రణపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. రాంగ్‌రూట్ ప్రయాణాన్ని కట్టడిచేసేందుకు కఠినంగా వ్యవహరించనున్నారు. రోడ్డు దాటేందుకు యూటర్నులకు చేరుకోవటానికి కొందరు రాంగ్ రూట్‌లో పోయి ప్రమాదాలకు గురవుతున్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించే వారు పట్టుబడితే జరిమానా మాత్రమే కాకుండా వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నారు. రోడ్డు పనుల నేపథ్యంలో ట్రాఫిక్ రూల్స్‌ను మరింత కచ్చితంగా అమలు చేస్తామని, ప్రజల ప్రాణాలే తమకు ముఖ్యం అని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ అన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం


తలకొండపల్లి : సంకటోనిపల్లిలో పీర్ల ఊరేగింపు


చేవెళ్ల : పీర్ల ఊరేగింపులో రామన్నగూడ గ్రామస్తులు


కొందుర్గులో పీర్ల ఊరేగింపు


కడ్తాల: మక్తమాదారంలో మొహర్రం వేడుకల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, తదితరులు

త్యాగానికి ప్రతీక మొహర్రం అని మైనార్టీ నాయకులు అన్నారు. బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు జరుపుకున్నారు. పీర్ల చావిడీలలోని పీర్లను దర్శించుకొని బెల్లం, కొబ్బరి కాయలు, దట్టీలు సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పీర్లతో పట్టణాలు, గ్రామాల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. ముస్లిం మైనార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తూర్ : జేపీ దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తదితరులు


మొయినాబాద్ రూరల్ : చిలుకూరులో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న మైనార్టీ నాయకులు


యాచారం : కుర్మిద్దలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు


కందుకూరు : పీర్ల ఊరేగింపులో పాల్గొన్న పులిమామిడి గ్రామస్తులు


షాబాద్ : మీరాపూర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు చెన్నాబాయ్ తదితరులు


కేశంపేట : పీర్లతో ఊరేగుతున్న మైనార్టీలు

చౌదరిగూడ ఎస్సైగా విజయ్‌కుమార్



చౌదరిగూడ, జూలై 17: జిల్లెడ్ చౌదరిగూడ మండల ఎస్సైగా విజయ్‌కుమార్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సైబరాబాద్ పరిధిలోని రాయదుర్గం నుంచి విజయ్‌కుమార్ బదిలీపై చౌదరిగూడకు రాగా, చౌదరిగూడలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై నక్రం బదిలీపై రాయదుర్గం వెళ్లారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ విజయ్ కుమార్, బదిలీపై వెళ్లిన నక్రంను వివిధ పార్టీల నాయకులు ఘనంగా సన్మానించారు.

కొత్తూర్ ఎస్సైగా మురళీగౌడ్

కొత్తూర్, జూలై 17: కొత్తూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా మురళీగౌడ్ నియమితులైనారు. ఈమేరకు బుధవారం మురళీగౌడ్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధి కేబీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ కొత్తూర్‌కు బదిలీపై వచ్చారు.

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఎస్సైగా తేజంరెడ్డి

యాచారం, జూలై 17 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఎస్సైగా తేజంరెడ్డి ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాడకొండూరు స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై ప్రసాద్ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్సై తేజంరెడ్డి కోరారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

● ఆలయాలలో భక్తుల వ్రతాలు, అభిషేకాలు


ఆమనగల్లు : వేంకటేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


శంషాబాద్ రూరల్ : ఏకాదశి పూజల్లో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజ్

ఆమనగల్లు/తలకొండపల్లి/కడ్తాల్, జూలై 17: తొలిఏకాదశి వేడుకలు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో ప్రధాన ఆలయాలు సందడిగా మారాయి. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి సాయంత్రం ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవతో మేలుకొలుపు పాడారు. స్వామివారికి ప్రభాత సేవ, సహస్రనామ తులసీదళ అర్చన, ప్రబంధ పారాయణం, మంగళశాసనం, అర్చనలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, అఖండ భజనలు ,పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శంషాబాద్ రూరల్ : తొలి ఏకాదశి సందర్భంగా శంషాబాద్ మండలంలోని అమ్మపల్లి శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, పల్లకీసేవ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తన్వీరాజ్ పూజలు నిర్వహించారు.

షాద్‌నగర్ అర్బన్ : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ప్రధాన పూజారి శ్రీనివాసచార్యులతో పాటు మరో నలుగురు పూజారులు భక్తుల గోత్రనామాలు చదివి, అర్చన చేయడానికి ఇబ్బందిపడాల్సి వచ్చింది. ఒకదశలో అర్చనలను పక్కనపెట్టి దర్శనాన్ని కొనసాగించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో సేవాదళ్ సభ్యులు క్రమ పద్ధతిలో భక్తులు స్వామిని దర్శించుకునేలా శ్రద్ధ తీసుకున్నారు.

కొందుర్గు : ప్రతీ ఒక్కరు భక్తిభావాలను పెంపొందించుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు కందుకంల నర్సింహులుగౌడ్ కోరారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఉదయం అభిషేకం, అర్చన, అష్టోత్తరం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రం శివారులో పెండ్యాల గుట్ట మీద ఉన్న పాత శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో స్వామి వారికి అభిషేకం, దేవాలయ ఆవరణలో ఉన్న అంజనేయ స్వామికి చందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజారి భరత్, గ్రామస్థులు పాల్గొన్నారు.


కొందుర్గు : పెండ్యాల గుట్టపై లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద భక్తులు

లంగాడి క్రీడను ప్రోత్సహించాలి


రక్షా నిఖిల్ ఖడ్సేకు వినతిపత్రం ఇస్తున్న సురేశ్‌గాంధీ

శంషాబాద్ రూరల్, జూలై 17: లంగాడి క్రీడను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని లంగాడి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సురేశ్‌గాంధీ, తెలంగాణ లంగాడి సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్ కోరారు. ఈమేరకు బుధవారం మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లా ముక్తాయ్‌నగర్‌లోని యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ రాష్ట్ర మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేను వారు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. లంగాడి క్రీడను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలని కోరడంతో పాటు ఎస్‌జీఎఫ్‌ఐ, స్పోర్ట్స్ మినిస్ట్రీ అసోసియేషన్ గురించి మంత్రితో చర్చించినట్లు వారు తెలిపారు. ఇందుకు స్పందించిన ఆమె ఎస్‌జీఎఫ్‌ఐకి అనుబంధంగా ఉన్న రాష్ట్రాల వివరాలతో ఢిల్లీకి రావాలని ఆమె తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటక రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లంగాడి జయవంత్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మాడ్గుల : మండలంలోని నర్సంపల్లికి చెందిన కూన జంగయ్య, పోలె కాశయ్య ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను అదే గ్రామానికి చెందిన బీజేపీ మండలాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ పరామర్శించి తలా 50కిలోల బియ్యాన్ని సమకూర్చి అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలె శివకుమార్, పోలె మహేందర్, కిన్నెర శివ తదితరులు ఉన్నారు.

కందుకూరు : కొత్తూరు గ్రామంలో అమెజాన్ కంపెనీ నూతనంగా ఏర్పాటుచేసిన గ్రంథాలయ శాఖకు గ్రామస్తులు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా తోకల శ్రీనివాస్‌గౌడ్, వైఎస్ చైర్మన్‌లుగా అక్కనపల్లి శ్రీనివాస్, కె.ప్రభాకర్, పి.రవీందర్‌లను ఎన్నుకున్నారు.

మాడ్గుల : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముద్దం రాములు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ యువనాయకుడు నూదిని శరత్‌రెడ్డి ఆస్పత్రికి రాములును పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం అందచేశారు.

యాచారం : మండల కేంద్రానికి చెందిన పరమేశ్వర్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. యాచారం మండల కేంద్రానికి చెందిన పరమేశ్వర్ ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన గీతం విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈనెల 13న బెంగళూరులో జరిగిన స్నాతకోత్సవంలో పట్టా అందుకున్నారు. యాంటిడిప్రెసెంట్, యాంటీలిపిడెమిక్ డ్రగ్స్ ట్రీట్‌మెంట్‌లో నానోపార్టికల్-బెస్ట్ ట్రాన్స్‌డెర్మల్, డ్రగ్‌డెలివరీ అనే అంశంలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా పొందారు. పరమేశ్వర్ పీహెచ్‌డీ పట్టా సాధించడం పట్ల మండల కేంద్రానికి పలువురు గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.

షాద్‌నగర్‌అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న రైతు రుణమాఫీ సంబరాలను గురువారం నిర్వయిస్తామని వ్యవసాయ శాఖ ఏడి రాజారత్నం తెలిపారు. షాద్‌నగర్ డివిజన్‌లో లక్ష రూపాయల లోపు పంట రుణం ఉన్న 13,462 మంది రైతులకు 75,64,33,287 రూపాయల రుణం మాఫీ కాబోతున్నదని తెలిపారు. వారందరికి గురువారం వారివారి బ్యాంకు ఖాతాలో జమ అయితాయని పేర్కొన్నారు.

ప్రొటోకాల్‌పై మాట్లాడే అర్హత సబితారెడ్డికి లేదు


మాట్లాడుతున్న కాంటేకార్ మధుమోహన్

మహేశ్వరం, జూలై 17 : ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రొటోకాల్ విషయంలో గత ఐదేళ్లుగా ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నారో తనకు సొంతంగా అనుభవమైతే తప్పా ఎమ్మెల్యే సబితారెడ్డికి తెలిసిరాలేదని, ప్రొటోకాల్ గురించి ఆమెకు మాట్లాడే అర్హత లేదని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ అన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని కిల్లామైసమ్మ దేవాలయంవద్ద బోనాల చెక్కుల పంపిణీకి హాజరైన మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ హాజరుకావడాన్ని నిరసిస్తూ రాద్ధాంతం చేసిన సబితారెడ్డి గతాన్ని మరిచిపోయి మాట్లాడారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏమాత్రం ప్రొటోకాల్ పాటించకుండా ప్రతిపక్షాలకు విలువలు ఇవ్వకుండా మొత్తం బీఆర్‌ఎస్ నాయకులతో అధికార కార్యక్రమాలు చెలాయించిన సబితారెడ్డి ఇప్పుడు ప్రొటోకాల్ గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో అడ్డగోలుగా బీఆర్‌ఎస్ నాయకులకు పూర్తి అధికారాలు ఇచ్చి భూ కబ్జాలకు పాల్పడడమే కాకుండా ప్రతిపక్షాలను అడుగడుగునా అవమానాలకు గురి చేసిన ఎమ్మెల్యే పద్ధతిలో ఇకనైనా మార్పు రావాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, జాపాల భావన సుధాకర్, పద్మశివయ్య, శివశంకర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'సబితాఇంద్రారెడ్డిని అవమానించడం సిగ్గుచేటు'

కందుకూరు, జూలై 17: మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలన అని చెప్తున్న కాంగ్రెస్ పార్టీ.. అదే ప్రజాపాలనలో రాష్ట్రంలోనే సీనియర్ మహిళా నాయకురాలు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని ఆర్కేపురంలో బోనాల చెక్కుల పంపిణీలో ఆహ్వానించి అవమానించడం సిగ్గుచేటన్నారు. ఏ హోదా ఉందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో సభావేదికపై కుర్చున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ నుంచి పార్టీ మారిన నేతలతోపాటు కాంగ్రెస్ నాయకులకు సబితారెడ్డిని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. పార్టీ అధిష్టానం ఆరు గ్యారెంటీలు అమలు చేయడంపై దృష్టిపెట్టాలని హితవు పలికారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

చేవెళ్ల, జూలై 17 : గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు చేస్తున్న సేవలను సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించడం సంతోషంగా ఉందని ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘం చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు జి.రాంచందర్, ప్రధాన కార్యదర్శి వీరనందంచారి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సేవలను సీఎం గుర్తించిన సందర్భంగా బుధవారం చేవెళ్ల డివిజన్ గ్రామీణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలోని హైదరాబాద్-బీజాపూర్ హైవేపై భారీ ర్యాలీ నిర్వహించి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు జగన్, కార్యదర్శి మైపాల్, కోశాధికారి ప్రభాకర్, సభ్యులు తదితరులు ఉన్నారు.



పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఆమనగల్లు/కేశంపేట/యాచారం , జూలై 17: పెండింగ్ బిల్లులను చెల్లించే వరకు పోరాటం కొనసాగిస్తామని మధ్యాహ్న భోజన కార్మికులు అన్నారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం ఎదుట పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని సీఐటీయు ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జె.పెంటయ్య సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు డిమాండ్ చేశారు. కేశంపేటలో దీక్ష మూడవ రోజుకు చేరుకుంది. కాగా, ఒక్కో కార్మికుడికి నెలకు రూ.పదివేల వేతనమివ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.బ్రహ్మయ్య, మండల కన్వీనర్ చందూనాయక్ అన్నారు. యాచారంలో చేపట్టిన నిరవధిక దీక్షలో వారు పాల్గొని కార్మికులకు సంఘీబావం తెలిపారు.

క్రైం కార్నర్

యూనియన్ బ్యాంకులో అగ్నిప్రమాదం

● శంషాబాద్ బ్రాంచిలో ఘటన.. ఫైర్ అలారం మోగడంతో పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు
● సీసీ కెమెరా సర్క్యూట్ బాక్స్‌లో చెలరేగిన మంటలు
● తప్పిన పెను ముప్పు.. ఊపిరి పీల్చుకున్న బ్యాంకు సిబ్బంది, స్థానికులు

శంషాబాద్, జూలై 17 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని రాళ్లగూడ రోడ్డులో గల యూనియన్ బ్యాంకులో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, బ్యాంకులో ఫైర్ అలారం మోగడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్‌ను రప్పించడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాళ్లగూడ రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంకులో మంగళవారం సిబ్బంది కార్యకలాపాలు ముగించుకొని సాయంత్రం బ్యాంకుకు తాళం వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బ్యాంకులో ఫైర్ అలారం మోగింది. బ్యాంకు చుట్టుపక్కల ఇళ్లలో ఉండే ప్రసాద్, రాజు, కృష్ణలు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకొని ఫైర్‌ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. ఈక్రమంలో బస్తీవాసులు గ్రామంలో ఉంటున్న బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్‌కు సమాచారం ఇవ్వగా.. వెంటనే వచ్చి బ్యాంక్ షట్టర్స్ తెరిచారు. మేనేజర్ గదితో పాటు బ్యాంకు లోపలి గదిలో పొగ కమ్ముకొని ఉంది. అయితే, మేనేజర్ గదిలో ఉన్న సీసీ కెమెరా సర్క్యూట్ బాక్స్‌లో మంటలు చెలరేగి.. దాని పక్కనే ఉన్న ఓ ఫైల్‌కు మంటలంటుకున్నాయి. వెంటనే ఆ ఫైల్‌ను బయటకు తెచ్చారు. ఫైర్ సిబ్బందితో కలిసి బ్యాంకు లోపలి గదుల్లోకి వెళ్లి కిటికీలన్నీ తెరిచారు. విద్యుత్ సిబ్బందని పిలిపించి కరెంటు సరఫరా నిలిపివేయించారు. మంటలు అంటుకున్న ఫైల్‌ను బయటపడేయడంతో మంటలు చల్లారి పోవడం, గదుల్లో అలుముకున్న పొగ మామూలు స్థితికి రావడంతో ఫైర్ సిబ్బందికి పెద్దగా పని పడలేదు. బ్యాంకులోని ఫైళ్లకు గానీ, ఇతర కంప్యూటర్లకుగానీ ఎలాంటి ప్రమాదం జరగలేదని బ్యాంకు సిబ్బంది పోలీసులకు తెలిపారు. ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని పోలీసులు మీడియాకు తెలిపారు. ప్రమాదం పెద్దగా సంభవించకపోవడంతో సిబ్బంది, బస్తీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

కారు బోల్తాపడి బాలుడు దుర్మరణం

● స్కూల్‌కు సెలవు కావడంతో స్నేహితులతో కలిసి బయటికెళ్లిన మైనర్
● రోడ్డుపై రాయిని తప్పించబోతుండగా బోల్తాపడిన కారు
● మరో బాలుడి చేయి విరగ్గా.. ఇద్దరికి గాయాలు.. నలుగురూ మైనర్లే

శంకర్‌పల్లి, జులై 17: స్నేహితుడిని కలిసేందుకు వెళ్లిన బాలుడు కారు బోల్తాపడటంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనలో మరో ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. అందులో ఒకరి చెయ్యి విరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లిలోని రేవతి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే నలుగురు స్నేహితులు సెలవు దినాల్లో క్రికెట్ ఆడతారు. ఈక్రమంలో బుధవారం పాఠశాలకు సెలవు కావడంతో క్రికెట్ ఆడకుండా కారులో నలుగురూ కలిసి ఉదయం 5.30 గంటలకు మహారాజ్‌పేట్‌లోని మరో స్నేహితుడి వద్దకు బయలుదేరారు. మోకిలలో స్నేహితుడిని కారులో ఎక్కించుకొని మహారాజ్‌పేట్‌కు వెళ్లారు. అక్కడ కొద్దిసేపు స్నేహితునితో గడిపి తిరుగు ప్రయాణమయ్యారు. మోకిలలో స్నేహితుడిని దింపి శంకర్‌పల్లికి వస్తుండగా మున్సిపల్ పరిధిలోని రాఘవేంద్రస్వామి గుడి సమీపంలోకి రాగానే రోడ్డు మధ్యలో రాయిని తప్పించపోయి కారు అదుపుతప్పి పక్కనే ఉన్న ప్రహరీని ఢీకొంది. అతివేగంతో ఉన్న కారు బోల్తాపడటంతో కుమ్మరి విగ్నేష్(14)కు తీవ్రగాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరికి స్వల్పగాయాలు కాగా.. మరో బాలుడి చేయి విరిగింది. మృతుడు విగ్నేష్‌ది మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామం కాగా.. మిగతా ముగ్గురిది శంకర్‌పల్లి. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హబీబుల్లాఖాన్ తెలిపారు. విగ్నేష్ తల్లిదండ్రులు శంకర్‌పల్లిలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసముంటున్నారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

జన్వాడలో గుర్తుతెలియని వ్యక్తి..

శంకర్‌పల్లి, జులై17: జన్వాడ గ్రామ పరిధిలోని రోడ్డు ప్రక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మోకిల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జన్వాడ గ్రామంలోని రోడ్డు ప్రక్కన గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందాడు. బుధవారం రోజున స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. చనిపోయిన వ్యక్తి ఆచూకి తెలియదని అన్నారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. ఆచూకి తెలిసిన వారు మోకిల పోలీసులను సంప్రదించాలని వారు కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

కందుకూరు, జూలై 17: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతిచెందిన ఘటన మండలంలోని ఆకులమైలారంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బూచిరెడ్డి రాజేందర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న పశువులను ఉదయం మేతకు తీసుకెళ్లాడు. అయితే, అందులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్‌కు పాడి ఆవు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, ఆవును ఇటీవల లక్ష రూపాయలకు కొనుగోలు చేసినట్లు రైతు తెలిపాడు. విద్యుత్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించినట్లు రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

పండుగ సాయన్నకు ఘన నివాళి


షాద్‌నగర్‌అర్బన్/చేవెళ్ల : సాయన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ జేఏసీ నాయకులు, ముదిరాజ్ నాయకులు

షాద్‌నగర్ అర్బన్/చేవెళ్ల, జూలై 17: నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ, పేదలకు అండగా నిలిచి అమరుడైన పండుగ సాయన్నకు తెలంగాణ జేఏసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పండుగ సాయన్న జయంతిని పురష్కరించుకుని బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఆవరణ ఎదుట ఉన్న సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే షాద్‌నగర్ ముదిరాజ్ సంఘాల నాయకులు సాయన్న విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ముదిరాజ్ యువత అధ్యక్షుడు శ్రీధర్‌వర్మముదిరాజ్ మాట్లాడుతూ పండుగ సాయన్న నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహా వీరుడని పేర్కొన్నారు. జేఏసీ నాయకులు ఎం.జనార్ధన్ వి. రామారావు, నక్క బాల్‌రాజ్, రవీంద్రనాథ్, ఎం నరసింహులు, అర్జున్‌కుమార్, బి. నర్సింహులు, అనంత్ తదితరులు పాల్గొన్నారు. సాయన్నను ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సాయన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు వెంకటేశ్, శ్రీకాంత్, రాంప్రసాద్, చామంతి శివరాజ్, మండలంలోని సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన దెబ్బడగూడ మాజీ సర్పంచ్ శ్రావణి



కందుకూరు, జూలై 17:రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను దెబ్బడగూడ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ మహిళా నాయకురాలు ఏనుగు శ్రావణి కలిసి ఘనంగా సన్మానించారు. బుధవారం నగరంలో శారద బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండల మహిళా నాయకురాళ్లతో కలిసి సన్మానించారు. శ్రావణి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళలకు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు, రక్షణ ఇవ్వలేకపోయిందని, మహిళలకు అన్ని రంగాల్లో రక్షణ కల్పించడానికి కృషి చేయాలని శారద దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బడంగ్‌పేట మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సమత, తదితదరులున్నారు.